www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 24 | 21-03-2022 | పుటలు : 4

## అంతర్జాతీయ ప్రాజెక్టులో

# నన్నయకు అవకాశం



**15.03.22 (మీడియాసెల్)** అంతర్జాతీయ స్థాయిలో మడఅడవులపై చేస్తున్న ప్రాజెక్టులో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అవకాశం దక్కిందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలో మంగళవారం అంతర్జాతీయ ప్రాజెక్ట్ అవకాశానికి గల కారణాలను వీసీ తెలియజేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి ఆధ్వర్యంలో గతంలో "కెపాసిటీ బిల్డింగ్, ఇంటర్నేషనల్ నెట్ వర్కింగ్ కోసం అవకాశాలు" అనే అంశంపై మరియు మడ అడవులపై నిర్వహించిన వెబినార్లకు విశేష స్పందన వచ్చిందని అన్నారు. నాటి వెబినార్లలో కీలక ఉపన్యాసమందించిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషమోగ్రఫీ, ఎన్విరాన్మెంట్ విశ్వవిద్యాలయం మలేషియా సహాచార్యులు బెహరా సత్యనారాయణ, డిపార్ట్మెంట్ ఆఫ్ బోటని, యూనివర్సిటీ ఆఫ్ రుహునా, శ్రీలంక సీనియర్ లెక్చలర్ డా.కె.ఎ.సునంద కోడికర లు విశ్వవిద్యాలయంలో విద్య, పరిశోధన, కార్యచరణలను పరిశీలించి అంతర్జాతీయ ప్రాజెక్టులో నన్నయ విశ్వవిద్యాలయ భాగస్వామ్యానికి సహకరించారని అన్నారు. ప్రాంతీయ పరిశోధన కార్యకలాపాలను మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రతిపాదించబడిన ప్లాట్ ఫామ్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని భాగస్వామ్యం చేయడం హర్షనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఐదు విశ్వవిద్యాలయాలు ఈ ప్రాజెక్టులో పని చేయనున్నాయని తెలిపారు. సమన్వయ విశ్వవిద్యాలయంగా యూనివర్సిటీ ఆఫ్ రుహునా – శ్రీలంకా, సమర్ విశ్వవిద్యాలయం – ఫిలిప్పీన్స్, సోకోయిన్ విశ్వవిద్యాలయం – టాంజానియా, యూనివర్సిటీ మలేషియా తెరెంగాను – మలేషియా, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం – ఇండియాలు సంయుక్తంగా ప్రాజెక్టును నిర్వహిస్తాయని తెలియజేసారు. సమన్వయ విశ్వవిద్యాలయమైన యూనివర్సిటీ ఆఫ్ రుహునా దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధమైన తరువాత ఐదు విశ్వవిద్యాలయాలు భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేస్తాయన్నారు. ప్రపంచ స్థాయిలో కొన్ని అంశాలను ప్రచురించడానికి, చర్చించడానికి, పెద్ద డేటాసెట్ ను సేకరించడానికి వివిధ దేశాలలో ఒకే పరిశోధనను పునరావృతం చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. అంతర్జాతీయ ప్రాజెక్టులో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అవకాశం కల్పించి సహకరిస్తున్న డా.కె.ఎ.సునంద కోడికర, బెహరా సత్యనారాయణ మరియు యూనివర్సిటీ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరిని అభినందించారు.

## బి.ఎస్.ఎన్.ఎల్ ఫైబర్‌కు

# ప్రణాళికలు సిద్ధం చేయండి

**14.03.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మొత్తం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బి.ఎస్.ఎన్.ఎల్) నెట్ వర్క్ ఏర్పాటు చేసి, విద్యార్థులకు పూర్తి స్థాయి ఇంటర్నెట్ సదుపాయం కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో సోమవారం బి.ఎస్.ఎన్.ఎల్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై మాట్లాడారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నెట్ వర్క్ సమస్యలు అధికమవుతున్నాయని, సెల్యులర్ ఫోన్ సిగ్నల్స్ సమస్యలు ఉన్నాయని వీటిని అధిగమిస్తూ విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా నెట్ వర్క్ సదుపాయం కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బి.ఎస్.ఎన్.ఎల్ అప్టికల్ ఫైబర్ ఇంటిగ్రేషన్ ద్వారా అన్ని భవనాలకు సాంకేతికంగా అనుసంధానం చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలోని ప్రతీ భవనంలోను సర్వర్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రాంగణమంతా నెట్ వర్క్, ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించాలన్నారు. సెల్యూలర్ ఫోన్ సిగ్నల్స్ సమస్యలు అధిగమించేందుకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బి.ఎస్.ఎన్.ఎల్ టవర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యాలను కల్పిస్తూ డా.బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ, బాయ్స్ హాస్టల్, గార్ల్స్ హాస్టల్స్,



పరిపాలన భవనాల వద్ద పూర్తి స్థాయి వైఫై సదుపాయాలను అందించాలన్నారు. భవిష్యత్ లో కూడా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నెట్ వర్క్, ఇంటర్నెట్ కు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. యూనివర్సిటీ ఐ.టి విభాగం, వెబ్ మాస్టర్ సహకారంతో ప్రాంగణమంతా సర్వే నిర్వహించి ప్రణాళికలను రూపొందించాలని తెలియజేసారు. బి.ఎస్.ఎన్.ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.వి.మాధవరావు, సబ్ డివిజన్ ఇంజనీర్ బి.వి.ఎల్.ఎన్.రాజు లు వీసీ సూచనల ప్రకారం విశ్వవిద్యాలయంలో పూర్తి స్థాయిలో సాంకేతిక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎ.మట్టారెడ్డి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.విజయనిర్మల, ఇంజనీర్ డా.కె.నూకరత్నం, వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాసరావు, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు మరియు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐ.ఎస్.టి.ఇ. స్టూడెంట్ చార్టర్ ప్రోగ్రాం

ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్టూడెంట్ చార్టర్ ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసేందుకు ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచన మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ పి ఎస్ ఎస్ బాలాజీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ ఐ. ఎస్. టి. ఇ. న్యూఢిల్లీ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐ.ఎస్.టి.ఇ. స్టూడెంట్ చార్టర్ ఏర్పాటు ద్వారా విద్యార్థులకు అధ్యాపకులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. ప్రోగ్రామ్ నిర్వాహకులకు ఆర్థిక సహకారం, విద్యార్థుల సభ్యత్వం, అవార్డులు, కొలాబరేషన్ ప్రోగ్రామ్స్ వంటివి ఐ.ఎస్.టి.ఇ. ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ ఐ.ఎస్.టి.ఇ. స్టూడెంట్ చార్టర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో ఐ.ఎస్.టి.ఇ. సహకారంతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ప్రయోజనాత్మక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామన్నారు. అనంతరం బాలాజీని సత్కరించి అభినందనలు తెలియజేశారు.



## సంపాదకీయం



# అహంకారం

ఒక పక్షి చిన్న మాంసం ముక్కను పట్టుకొని ఆకాశంలో ఎగురుతోంది. మరికొన్ని పక్షులు తనని వెంబడిస్తూ వేగంగా రావడం చూసింది. మాంసం ముక్కను క్రిందికి వదిలెయ్యగానే పక్షులు దాని వెంబడి క్రిందికి వెళ్ళిపోవటం గమనించి మాంసం ముక్కను వదులుకోవటం వలన ఆకాశంలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎగిరే అవకాశం కలిగిందని సంతోషపడింది.

బహుశా అహంకారాన్ని వదులుకోవటం వల్లనే గొప్ప స్వేచ్ఛని, ప్రశాంతతను పొందగలుగుతామేమో! ఎప్పుడో ఒకప్పుడు ఈ అహంకార దశను దాటటం కూడా అవసరమే.

అహంకారం పొగరుబోతుతనాన్ని పెంచిపోషిస్తుంది. నోటికి ఏమొస్తే అది మాట్లాడిస్తుంది. విలువైన సంబంధ బాంధవ్యాలను కూడా వదులుకునేలా చేస్తుంది. ఒకటిమాత్రం నిజం. దానివలన కోల్పోయినవాటికి అహంకారం ఎప్పుడూ సమానమైతే మాత్రం కాదు.

పైగా అహంకారానికి ఒక స్వభావం ఉంది. దానికి రోజూ మేత కావాలి. ఇతరులను తిట్టటం, నోటికొచ్చినట్లు మాట్లాడటం, మేలు చేసినవారికే కీడు తలపెట్టటం, వాడెంత, వీడెంత అనటం, కొడతా, కొట్టిస్తాననటం వంటి ఆహారం విపరీతంగా అందించాలి. తామే గొప్పవాళ్ళమని, అధికులమని దానితో ఘర్షణ పడుతుండాలి.

ఒకవేళ అహంకారానికి తిండి పెట్టకపోతే, మౌనంవహిస్తే ఆత్మన్యూనతాభావంతో, తాము తగ్గిపోతున్నామనే కసితో, అభద్రతతో బాధపడాల్సి వస్తుంది. ఎలా చూసినా దానికున్న శక్తి ఏమిటంటే మనశ్శాంతిని దోచుకోవటం. మానసికంగా మనుషులమీద కసిని పెంచుకోవటం. ఇదంతా ఎదో ఒకరోజు శరీరం శాశ్వత విశ్రాంతిని తీసుకునేవరకు. అది ఎవరికైనా ఎలాగూ తప్పదు.

అహంకారాన్ని పెంచి పోషించుకునేవాడికి తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ళు, బంధు మిత్రులు అని ఏదీ ఉండదు. ఒక్కొక్క క్షణం భారమై, ప్రతి పరిస్థితి వల్ల, మనిషి వల్ల ఒత్తిడిని పొందుతూ శరీరం, మనసు నిత్యం నిప్పులమీద నడుస్తూ ఉంటుంది.

అహంకారం మొదలైతే అన్నీ వెళ్లిపోతాయి. అందరూ దూరమౌతారు. అది వెళ్ళిపోతే అన్నీ వెనక్కి వస్తాయి. ఇంతే లాజిక్. ఏది స్వీకరించాలి, ఏది వదులుకోవాలనేది మనిషి వివేచన మీద ఆధారపడి ఉంటుంది.

అహంకారం ఒక మానసిక వ్యాధి. మనోవిజ్ఞాన శాస్త్రంలో దానిమీద చాలా పరిశోధనలు జరిగాయి. కొందరు ఈ వ్యాధిని బయటికి కనిపించకుండా కృత్రిమమైన నవ్వుమొహంతో కప్పుతారు. దీనికి ఔషధాలు కూడా ఏమీలేవు. శ్రీ చాగంటి, గరికిపాటి, సామవేదం వంటివారి ఉపన్యాసాలు కూడా ఈ వ్యాధిని తగ్గించలేవు.

ఒక్కటిమాత్రం గుర్తుపెట్టుకోండి. అహంకారాన్ని వదులుకోనివారిని మనమే వదిలెయ్యాలి. దానివల్ల మనం ప్రశాంతంగా ఉంటాం. ఆనందంగా, అందంగా జీవించగలుగుతాం. అది మనచేతుల్లోనే ఉంది. అహంకారాన్ని వదిలేయటం అవతలివారికి చేతకానప్పుడు అహంకారులను వదిలెయ్యటం మన చేతుల్లో ఉందనే విషయాన్ని గుర్తుపెట్టుకోండి చాలు.

# విక్టర్ జారా నవల

## పుస్తకం




విక్టర్ జారా.. ఒక అసంపూర్ణ గీతం పుస్తకం. లాటిన్ అమెరికా దేశాల్లో ఒకటైన చిలీ దేశస్తుడు విక్టర్. అతి నిరుపేద దుర్భర బాల్య నేపథ్యం అతనిది. కుటుంబాన్ని పట్టించుకోని తాగుబోతు భర్త నుంచి పిల్లల్ని వంద చేతులతో కాపాడుకున్న కష్టజీవి అమ్మ అమాండా అంటే విక్టర్‌కి అమితమైన ఇష్టం. పట్టుదల, నిజాయితీ, కష్టం, కష్టాలకు తట్టుకునే తత్వం, వీటన్నింటితో పాటు అమ్మ నుంచి పాటను కూడా వారసత్వంగా పొందాడు విక్టర్.

బతకడానికి కాయకష్టం, బతుకును బతికించడానికి చదువు సమాంతరంగా సాగించాడు. కడపు కష్టాలతో పాటు, చదువుతో పాటు పాటను తన ప్రాణానికి జీవధాతువుగా మార్చుకున్నాడు. రెక్కల కష్టంతో దేశాలు నిర్మించే కూలినాలి కూపాల మీదుగా నడిచి వచ్చాడు కాబట్టి తన పాట ఎవరి కోసమో.. ఎవరికి చెందాలో వారికే దాన్ని అంకితం చేశాడు.

వయసు వచ్చింది మొదలు అడుగు బడుగు జీవుల వాడల నుంచి, శ్రమజీవుల గుండెల నుంచి, పల్లెల నుంచి జానపదుల జీవితాల నుంచి పాటలు సేకరిస్తూ తిరిగి పాటలు కడుతూ కడదాకా తాను ఊగుతూ దేశాన్ని ఊగిస్తూ బతికాడు. యావత్తు దేశానికే పాటను ప్రాణవాయువుగా మార్చడంలో చరిత్రలోనే నిజమైన సాంస్కృతిక హీరోగా ప్రసిద్ధికెక్కాడు. చిలీలోనే కాదు, మొత్తం లాటిన్ అమెరికా దేశాల్లోనే సాంస్కృతిక ఉద్యమ సంగీతంగా నిలిచాడు.

మనిషి రెక్కల నుంచి పాట పుడుతుంది. ఆ పాటే మనిషిని ముందుకు నడిపిస్తుంది. అది అన్ని రంగాల ప్రజల్నీ ఏకం చేస్తుంది. తమలో.. తమ చుట్టూ యుగాలుగా గడ్డలు కట్టిన చీకటిని బద్దలు చేయడానికి ఆ పాటే వారిని కలసికట్టుగా ముందుకు నడిపిస్తుంది. పాటే చరిత్ర తిరగ రాస్తుంది. నియంతృత్వాలకు చరమ గీతం పాడుతుంది. ప్రజాస్వామ్య సౌధానికి పునాదులు వేస్తుంది. అలా అని విక్టర్ నిరూపించాడు.


ఏ దేశంలోనైనా ప్రజాస్వామిక విలువలు ప్రాణం పోసుకుని, తరాల మానవ మహా స్వప్నపతాకం గగనాన ఎగరాలంటే ఆ దేశాన్ని ఆపాదమస్తకం సాంస్కృతిక ఉద్యమం అల్లుకుపోవాలి. అలాంటి మహత్తర కార్యక్రమంలో ముందున్నాడు విక్టర్. తన గిటార్‌కి దేశాన్ని తీగలా చుట్టి తన ఊపిరినంతా ఊదితే చిలీ ఉద్రూతలూగిపోయింది.

నాటకాలు వేయడం, వేయించడం, పాటలు రాయటం, పాడటం, పాడించడం, ప్రజల పాటల బాణీల కోసం దేశాన్ని జల్లెడ పట్టడం... అతని దినచర్య. నెరుడాలాంటి కవికి సన్మానం కోసమైనా, అలెండీ లాంటి నాయకుడి సభలకు ఉత్తేజం కోసమైనా, ప్రజాకోర్కెల నిరసన ప్రదర్శనల కోసమైనా, ప్రజా ప్రభుత్వ నిర్మాణానికి సాగే ర్యాలీల కోసమైనా, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలూ ఎవరికోసమైనా అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలే అసలైన వేదికలు.

ఆ ప్రదర్శనలకు ప్రాణం విక్టర్. పల్లెలు పట్టణాలు వీధులు పేద వాడలు ఫ్యాక్టరీలు పంట పొలాలు అంతటా సాంస్కృతిక కోలాహలమే. ఆ కోలాహలం ప్రతి అడుగులో విక్టర్ ధ్వనిస్తాడు. వేలాది పాటలు, నాటకాలు, రికార్డులు అతని ఆస్తి. అసలు అంతటి బలమైన సాంస్కృతిక ఉద్యమం లేకుండా ఏ దేశంలోనూ ప్రజాతంత్ర ప్రభుత్వాలు ఏర్పడలేవని తేల్చి చెప్పటానికి చిలీ చరిత్ర విక్టర్‌ని కాగడాలా పట్టి చూపించింది.

అంతటి సాంస్కృతిక యోధుడిని చిలీలో నియంతృత్వ శక్తులు అతి కిరాతకంగా చంపేశాయి. అతడినీ, అతని పాటనీ, అతని గిటార్‌నీ తూటాలతో మాయం చేయవచ్చని ప్రయత్నించాయి. అతనినొక అనామకుడిగా మట్టిలో పాతేయాలని చూశాయి. విక్టర్ హత్య ఘట్టానికి వచ్చేసరికి ఒంట్లో నరాలు తెగుతూ వుండడం మొదలవుతుంది. అయితేనేం... అనాధ శవంగా విక్టర్‌ని పూడ్చిపెట్టిన సమాధి మీద ఇప్పటికీ రోజూ పూలు వర్షిస్తాయి

– విప్లవ్ కుమార్




## మంచి మాట

కృషి ఉంటే
మనుషులు
ఋషులౌతారు,
మహా పురుషులౌతారు!
తరతరాలకు తరగని
వెలుగౌతారు,
ఇలవేలుపులౌతారు!!

# నన్నయలో 28 నుండి శిక్షణ తరగతులు

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

రాజీవ్ గాంధీ యువజనాభివృద్ధి జాతీయ విశ్వవిద్యాలయం, శ్రీ పెరంబదూర్, తమిళనాడు మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, సోషల్ వర్క్ విభాగం సంయక్తంగా ఈ నెల 28 నుండి 30 తేదీ వరకు రెండు రకాల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం ట్రైనింగ్ ప్రోగ్రామ్ బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలియజేసారు. “ట్రైనింగ్ ప్రోగ్రామ్ టు యూత్ ఆన్ ది రోల్ అఫ్ లైఫ్ స్కిల్స్ ఇన్ కెరీర్ డెవలప్మెంట్” అనే అంశంతో రెండు శిక్షణా తరగతులు 1. కెపాసిటీ బిల్డింగ్ 2. స్కిల్ డెవలప్మెంట్ అండ్ లీడర్షిప్ అనే వేరు వేరు అంశాలపై శిక్షణా తరగతులు జరుగున్నాయని తెలిపారు. ఇలాంటి కార్యశాలల ద్వారా విద్యార్థులు లీడర్షిప్ కి కావలసిన అనేక మెలుకువలు నేర్చుకోవచ్చని తెలిపారు. దేశం నలుమూలనుండి నిపుణులు పాల్గుంటారని అన్నారు. దీనికి కన్వీనర్లుగా డా.ఎన్.కిరణ్ చంద్ర, డా.ఆర్.జానకిరావు కో– కన్వీనర్లగా డా.పి.వెంకటేశ్వర్లు, డా.మల్లి భాస్కరరావు వ్యవహరిస్తారని చెప్పారు.

# హార్టీకల్చర్ బిజినెస్‌పై అవగాహన



రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన హార్టికల్చర్ అండ్ నర్సరీ ఎక్స్పో 2022 కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగం విద్యార్థులకు అధ్యాపకులు అవగాహన కలిగించారని విశ్వవిద్యాలయ వీసి ఆచార్య జగన్నాథరావు తెలియజేశారు. కడియపులంక నర్సరీలు మరికొన్ని ప్రైవేటు ఆర్గనైజేషన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఎగ్జిబిషన్ స్టాల్స్, నర్సరీ రిలేటెడ్ ఐటమ్స్ ప్రదర్శనలను విద్యార్థులు తిలకించి అవగాహన చేసుకున్నారు. హార్టికల్చర్ అభివృద్ధి మరియు వ్యాపార పరంగా ఉన్న అవకాశాలు అంశాలను ఈ ఎగ్జిబిషన్ లో ప్రదర్శించారు. ఈ విషయాల పట్ల బోటనీ అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు అధ్యాపకులు డా.కె. శామ్యూల్ కుమార్,ఎమ్. ప్రజ్ఞ అవగాహన కలిగించారు. కార్యక్ర మంలో అధ్యాపకులు డా.ఎల్.ముత్యాలనాయుడు, డా.టి.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.






# శ్రీనివాస్ కుటుంబానికి పరిహారం చెక్కు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన గెడ్డం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు పరిహార చెక్కును వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అందజేశారు. శ్రీనివాస్ కోడింగ్ సెక్షన్ లోనూ ప్రిన్సిపాల్ కార్యాలయంలోనూ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విశ్వవిద్యాలయం తరపున రెండు లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య. టి.అశోక్, ఓ. ఎస్. డి ఆచార్య ఎస్.టేకి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ పాల్గొన్నారు.

# విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం



విజ్ఞాన శాస్త్రం మన సమాజంపై చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు సమాజంలో అనేక మార్పులకు కారణం విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి. సైన్స్ అంటే ప్రకృతిని పరిశీలించి, ప్రయోగాలు చేసి ఎందుకు, ఏమిటి, ఎలా, ఎప్పుడు, ఎక్కడ అని ఆలోచింప చేసేది. ప్రతి మనిషి తన నిత్య జీవితంలో ఉపయోగించే వస్తువులు కానీ, ఆహారం కానీ, నిర్వహణ కానీ, ప్రయాణ సాధనాలు, విద్యా వైద్య రంగాలలో సైన్స్ చాలా ప్రభావాన్ని చూపుతుంది. ప్రతి విద్యార్థిలో శాస్త్రీయ దృక్పథంతో సృజనాత్మకతను రూపొందించుకోవాలి. సైన్స్ ను కొత్త కోణంలో ఆలోచించగలగడం లేదా ఉన్న విషయానికి కొత్త భాష్యాన్ని చెప్పగలగటం. విభిన్న రీతిలో ఆలోచించి నూతన ఆవిష్కరణలకు నాంది పలకటం. విజ్ఞానశాస్త్ర విలువలను గమనిస్తూ సామాజిక అవసరాలను గుర్తిస్తూ శాస్త్రీయ వైఖరిని అభివృద్ధి చేసుకుంటూ శాస్త్రవేత్తల చరిత్రలను,ఆవిష్కరణలను అధ్యయనం చేయడం ద్వారా సైన్స్ పట్ల అవగాహన పెరుగుతుంది. విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు, పర్యటనలు, సైన్స్ క్లబ్ లలో విద్యార్థులు పాల్గొనటానికి ఎక్కువ ఆసక్తిని చూపించాలి. ఇవన్నీ నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తాయి. ప్రతి సైన్స్ విద్యార్థి కొత్త ఆవిష్కరణ చేపట్టడానికి ఆలోచన చేయాలి. ఎప్పుడైతే శాస్త్రీయ దృక్పథం అలవడుతుందో కార్యకారణ సంబంధాలను అన్వేషించే అలవాటు కలుగుతుంది. ఆ దిశగా విద్యార్థులు ప్రయాణిస్తారని ఆశిస్తున్నాను.

**డా.ఎమ్.గోపాలకృష్ణ**
**విద్యావిభాగం,అనూర్.**

# వర్సిటీ హోలీ

వసంతాగమనంలో
రంగుల హెూలీ !
మన జీవితాల్లో సమ్మోద కేళి!!

సంతోషపు హెూలీ రోజున ఒకరికొకరు చల్లుకునేవి
రంగులు కావు
అవి అనురాగ ఆప్యాయతలు కలిసిన పన్నీటి రంగుల జల్లులు!!!

హెూలీ మన జీవితాలలో నింపాలి ఆనంద పరిమళాలను
హెూలీ మన జీవితాలలో తేవాలి సుఖ శాంతి సౌభాగ్య విజయాలను .... !!!!

రచన : సవిత












హోలీ అనేది రంగుల పండుగ. వసంత కాలంలో వచ్చే ఈ పండుగను భారత దేశంలోనే కాకుండా, నేపాల్, బంగ్లాదేశ్, ప్రవాస భారతీయులు కూడా జరుపుకుంటారు. భారత దేశంలోని పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లలో దీన్ని దోల్‌యాత్రా (దోల్ జాత్రా ) లేదా బసంత-ఉత్సబ్ ("వసంతోత్సవ పండుగ") అని అంటారు.

హోలీ పండుగను ప్రజలు తమ చుట్టుప్రక్కల వారిపై రంగులను జల్లుకుంటూ రంగునీటిని పోసుకుంటారు. అధిక ముఖ్యమైన ఘట్టం ఒకరిపై ఒకరు రంగు నీళ్ళను పోసుకోవటాన్ని లోలా (నీటి బుడగ అని అర్థం) అని కూడా అంటారు.

మన దేశంలో హోలీ పండుగకు ప్రాముఖ్యమే ఉంది. ఈ పండుగ ప్రతి ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున వస్తుంది. ఈ పండుగను కుల మతాలకతీతంగా జరుపుకుంటారు. చిన్నా,పెద్దా అంటూ ఎటువంటి భేదభావాలు చూపకుండా ప్రజలు ఈ హోలీని సెలబ్రేట్ చేసుకుంటారు.

పురాణాల ప్రకారం రాధా కృష్ణుల ప్రేమకు చిహ్నంగా, నరసింహ అవతారంలో శ్రీ మహా విష్ణువు రాక్షసుల రాజైన హిరణ్యకశ్యపుని సంహరించిన రోజుకు గుర్తుగా కూడా హోలీ పండుగను జరుపుకుంటారు.

నిపుణులు సూచించిన మరో శాస్త్రీయ కారణం ఏమిటంటే, మన దేశంలో ఈ సమయంలో శీతాకాలం పోయి వేసవికాలం వస్తుంది. కాలానుగుణ మార్పుల కారణంగా ప్రజలు అలసటకు గురవుతారు. అంతేకాదు సోమరితనం మరియు నీరసంగా ఉంటారు కూడా. ఈ సమయంలో హోలీ జరుపుకోవడం వల్ల ఈ సోమరితం పోతుంది.

ప్రజలంతా ఈ పండుగ సందర్భంగా ఇండ్ల నుంచి బయటకు వచ్చి హోలీ ఆడటం వల్లే ఇదంతా జరుగుతుంది. రంగులు చల్లుకోవడం, ధోల్ మంజీరా ఆడడం, స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో పార్టీలు చేసుకోవడం వంటివి మనస్సు ఆనందాన్నిస్తాయి. అలాగే శరీరాన్ని పునరుత్తేజంగా మారుస్తాయి.

## హోలీ రంగులు



హోలీ పండుగలో రంగులకు ప్రముఖ పాత్ర ఉంది. పురాతన కాలంలో హోలీ ఆడేటప్పుడు సేంద్రీయ రంగులు ఉపయోగించేవారు. మన పూర్వులు అప్పట్లో హోలీ ఆడటానికి పసుపు రంగు కోసం పసుపు పొడిని, ఆకు పచ్చ రంగు కోసం ఆకులను ఉపయోగించేవారు. అలాగే ఎండిన పువ్వులను, మోదుగ పువ్వులతో రంగులను తయారుచేసేవారు.

ఆ రోజుల్లో పలాష్, మందార, గంధం, దానిమ్మ, కుంకుమ, గోరింట, బిల్వ ఆకులు, బంతి పువ్వు, అమల్టాస్, జకరండా, మోదుగ పువ్వులు వంటివి వాటితో హోలీ రంగులను తయారుచేసేవారు.

ఈ హోలీ పండుగ పౌరాణిక ప్రాముఖ్యతతో పాటు జీవిత పాఠాలను కూడా బోధిస్తుంది. ఇవి ప్రతికూలతలను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తుంది. ఇక దీంతో పాటుగా కొత్త సీజన్‌కు లో వచ్చే సవాళ్లను ఎదుర్కొనే శక్తిని కూడా అందిస్తుంది. జయహో!!!







































ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in